# భక్తి అనగా భగవంతునియందు పెంచుకున్న పరిపూర్ణ ప్రేమ

సకల శాస్త్ర పురాణ సంగ్రహవేత్తయై
వేదాంతవేద్యుడౌ విబుధుడైన
రక్తి ఏ పారగ రమ్య హర్మ్యంబుల
రమియించు రాజ చంద్రముడునైన
రణరంగమందు పరాభూతరిపుడౌచు
వెల్గొందు జగదేక వీరుడైన
దారిద్ర్యదేవతా దాక్షిణ్యమున కుందు
దౌర్భాగ్య విభుడగు దాసుడైన
భక్తిలేనిచో ఎందుకు పనికిరాడు
భక్తిలేనట్టి ఆ జగద్భర్త కన్న
భక్తిపరుడగు దాసుడే భవ్యుడగును

దివ్యాత్మ స్వరూపులారా!

'అనిర్వచనీయమ్ భక్తి'. ఇది వర్ణించుటకు సాధ్యము కానిది. లోకమునగల అనేక సాధనలన్నిటికంటె భక్తి సులభము, శ్రేష్టమైనది. 'భజ్' అనే ధాతువునకు 'తి' అనే ప్రత్యయము చేర్చిన 'భక్తి' అనే పదము ఏర్పడుతుంది. భక్తి అనగా సేవ, కొలువు. ఇది భయముతోకూడిన స్నేహము. త్రిగుణాత్మకమైన తత్త్వమును, త్రిగుణాతీతమైన శక్తితో పోల్చుకొనుటయందు కొంతవరకును వినయ, విధేయతలుకూడను అవసరము. 'భజ సేవాయాం'. త్రిగుణములతో మనో, వాక్కాయ, కర్మలచేత దివ్యత్వమును సేవించుటయే భక్తి. భక్తి అనగా పరిపూర్ణ ప్రేమ. భక్తి, ప్రేమలు అవినాభావ సంబంధములు. ఇవి రెండును

sri sathyasaivachanamrutam

అన్యోన్యాశ్రయములు. ముక్తికొరకు చేయు సాధనయే భక్తి. భక్తికి రూపము, ప్రేమ. అఖండమైన ప్రేమతో భగవంతుని సేవించటమే భక్తియని నారదులయొక్క భావము. ఆరాధనలయందును, అర్చనలయందును ప్రేమ, అనురక్తి కలిగినదే భక్తియని వ్యాసులవారి భావము. త్రికరణశుద్ధితో సేవలు గావించి అర్పితము గావించుకొనే చిత్తమునకు భక్తియని గార్గఋషి అభిప్రాయము. మనసును అదుపులో నుంచుకొని భగవంతునివైపు మరల్చి దివ్యమైన ఆనందమును అనుభవించటమే నిజమైన భక్తియని యాజ్ఞవల్క్యునియొక్క భావము. చిత్తమును ఆత్మవైపు మరల్చి ఏకత్వమైన ఆనందమును అనుభవించటమే భక్తి అని మహనీయులు అనేక విధములుగా బోధించుతూ వచ్చారు. ఏతావాతా ఈ నిర్వచనములన్నిటియందు ప్రధానమైనది 'ప్రేమ' ఒక్కటి మాత్రమే!

### భక్తి, లౌకిక విషయములందు మాత్రమేకాక, హృదయసంబంధమై ఉండాలి

ప్రతి మానవునియందుకూడను అంతోయింతో ప్రేమ ప్రవహిస్తూనేఉన్నది. పరమప్రేమస్వరూపుడైన పరమాత్మయందు జీవుడు ఒక అంశముగా ఆవిర్భవిస్తున్నాడు. మానవుడుకూడను ప్రేమస్వరూపుడే! కానీ, మానవుడు యీ ప్రేమను ప్రాకృతమైన మార్గములో ప్రవేశపెట్టటంచేత, యిది మాలిన్యమవుతున్నది. ఇటువంటి మాలిన్యముతోకూడిన పరమప్రేమరసమునందు భగవంతుని సుందరముఖారవిందము అంత స్పష్టముగా కనుపించుటకు వీలుకాదు. భక్తి అనగా కేవలము పూజించటము, ధ్యానించటము, జపించటము అనే మనము భావిస్తున్నాము. అనిర్వచనీయమైన ఆనందానుభూతిని అంతరాత్మద్వారా అన్వేషణ జరపటమే భక్తి. ఇది జీవుడు పరమాత్మతోకూడిన అధ్యాత్మరతియే అనికూడను చెప్పవచ్చును. హృదయకుహరమునుండి ఆర్తుడై ప్రార్థించిన ప్రార్థన చిత్తమునుండి ఆవిర్భవించి, ఒక అఖండమైన ప్రవాహముగా రూపొంది ప్రేమగా మారటము యిది ఒక భక్తి. ప్రేమయొక్క మానసిక పరివర్తనే భక్తి అనికూడను మరొక నిర్వచనము. ప్రేమచేత ప్రేమను పొందటమే ప్రధానమైన భక్తి. ఈ ప్రేమ బాహ్యమైన ప్రాకృత సంబంధమేకాక, పరతత్త్వమైన, అనన్యమైన, సాధ్యమైన



srisathyasaivachanamrutam

పరమప్రేమకు సంబంధించి వుండాలి. ప్రార్థన అనగా కేవలము అడుక్కోటం మాత్రముకాదు. తనయొక్క ఆర్తిని, తనయొక్క బాధను, తనయొక్క కోరికను పరమాత్మునితో చెప్పుకొనటమే! తనయొక్క గమ్యమును, తనయొక్క ధన్యమును, తనయొక్క పుణ్యమును పరమాత్మునికి అర్పితము గావించుటమే! కనుక, భక్తి అనేది కేవలము లౌకికమైన కార్యకలాపములందేకాక హృదయ పరివర్తనయందును, హృదయ ప్రవృత్తియందును మిళితమై వుండాలి.

**భగవంతునితో ఏకత్వమును కోరడమే భక్తి**

భగవంతునితో ఏకత్వమును కోరే దివ్యతత్త్వమే భక్తి. ఇది రెండు విధములుగా వుంటున్నాది. విద్యద్వారా ఈశ్వర తత్త్వమును గుర్తించి, తద్వారా తాను తరించటము. యిది జన్మతః ప్రారంభమై, అనేక రకములైన మానసిక ప్రవృత్తులను ఏకత్వము గావించి, తాను తరించి యితరులను తరింపజేసే ఈశ్వర ప్రేమ. ఇది సహజ భక్తి. విద్యవలన, విజ్ఞానమువలన ఈశ్వరత్వముయొక్క శక్తిని గుర్తించిన వ్యక్తి మాత్రమే తాను తరించగలడు. తాను తరించటమే కాకుండా తన తోటి మానవులనుకూడను తరింపజేసే శక్తి సామర్థ్యములు కలిగివుండటము, యిది రెండవభక్తి. 'సా-తరతి, లోకం తారయతి'. అనగా తాను తరించటము మరియు యితరులను తరింపజేయటము. మానవత్వమునందు అనంతమైన ప్రేమ ప్రవాహము అఖండముగా ప్రవహిస్తూనే వున్నది. ఈ ప్రేమను ప్రాకృతమైన మార్గమున మరల్చి, ప్రాకృతమైన వాంఛలయందు అంకితమొనరించి, మానవుడు తన సహజమైన ఆనందాన్ని కోల్పోతున్నాడు. ఈ ప్రేమను పరతత్త్వముపైన మరల్చి పవిత్రమైన స్థానమును గమ్యమును పొంది, జీవితమును ధన్యమును గావించుకొనే రీతిలో అనుభవించాలి. ఇట్టి దివ్యత్వమైన ఆనందము చదువులందులేదు. శాస్త్రమందులేదు. ఇది హృదయమందు మాత్రమే వుంటున్నది. ఇట్టి హృదయమునెరిగిన దివ్యత్వము ప్రాపంచికమైన విషయ వాసనలయందు యేమాత్రము ప్రవేశించదు. మందార పుష్పమునందుగల మకరందమును గ్రోలకలిగిన యీ తుమ్మెద వుమ్మెత్త పువ్వులపైన వురుకులెత్తునా? ఆకాశగంగలో ఆనందముగా ఓలలాడుచున్న హంస యీ యొక్క

sri sathyasai vachanamrutam

ప్రాపంచికమైన మలిన జలములందు ప్రవేశించునా? చెలగి మధువుగ్రోలిన మానవునకు చింతపండు రుచించునా? దివ్యభావములచేత, పవిత్రమైన వూహలచేత అనంతమైన ఆశలచేత నింపబడిన యీ హృదయము ప్రాకృతమైన, అనిత్యమైన, అశాశ్వతమైన, అసత్యమైన, క్షణభంగురమైన లోకమును ఆశించునా?

## భక్తి, మనము చేరవలసిన గమ్యమునకు ఒక మార్గమే!

కనుక, భక్తి అనగా కేవలము పరిపూర్ణమైన ప్రేమతత్త్వమే. ఇది చిత్తముయొక్క పరిపాకమే! కాయ కాయగా వుండినంతవరకు దీనియొక్క రుచి పులుపుగానే వుంటుంది. ఇదే పరిపక్వస్థితికి వచ్చేటప్పటికి మాధుర్యముగా మారుతుంది. ఫలముగా రూపొందుతుంది. అదే విధముగనే మానవత్వము విషయసంబంధమైన లోకముతో కూడివుండినంతవరకు యిది కేవలము సుఖదుఃఖములు, ఆశనిరాశలు మరియు నిందాస్తుతులతోకూడి వుంటుంది. భగవంతునియందు పరిపూర్ణప్రేమస్థితిని అనుభవించిన వ్యక్తి సృష్టిస్థితిలయములకు పొంగడు, కృంగడు, ఆనందించడు, దుఃఖముననుభవించడు. భక్తి అనగా మనము చేరే గమ్యమునకు మార్గమే! వేదము కేవలము ఒక మార్గమే! వేదాంతమే ఒక గ్రామము. ఈ గ్రామమనే వేదాంతమును చేరేంతవరకుకూడను వేదమనే మార్గమును మనము అనుసరించవలసినదే! వేదమనేనది అంతిమ లక్ష్యమైన దైవస్వరూపమని మనము భావించరాదు. ఇది కేవలము ఒక మార్గము మాత్రమేనని విశ్వసించాలి. దీనిని కేవలము ఒక guide post గా మనము విశ్వసించాలి. దీనిని మనము చక్కగా గుర్తించి వర్తించినప్పుడే యేవిధమైన ఆటంకములు, బాధలులేకుండా గమ్యమును చేరగలము. కనుక, భక్తి తత్త్వమనేది జీవితమును ప్రేమమయముగా మార్చి దివ్యమైన స్వరూపముగా తీర్చిదిద్దేది. ప్రేమ స్వార్థరహితమైనది. భగవత్తత్త్వము శిక్షయందుకూడను రక్షణ కలిగిస్తుంది. కోపమునందుకూడను కరుణను వెదజల్లుతుంది. దండనయందుకూడను దయను ప్రసరింపజేస్తుంది. కనుక, దండన దండన యని మనము దుఃఖించరాదు. దయను పొందే మార్గమే దండన! కరుణను చేకూర్చు నిమిత్తమే యీ క్రోధము. రక్షణ పొందే నిమిత్తమే యీ యొక్క శిక్ష. ఈ విధమైన

sri sathyasai vahini vachanamrutam

అర్థములను గుర్తించి పవిత్రమైన భావముతో దానిని స్వాగతము గావించిన వ్యక్తియే నిజమైన భక్తుడు. నిరంతరము మనము యీ ప్రాకృతమైన చింతనలయందే జీవితమును వ్యర్థము చేయరాదు. ఇట్టి దైవత్వమునుపొందే మార్గములు నవవిధములుగా బోధిస్తూవచ్చారు.

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గముద్వారా తమ గమ్యమును చేరి ధన్యత చెందిన వ్యక్తులు, మహాభక్తులు. ఇట్టి మహాభక్తులలో సామాన్యునినుండి చక్రవర్తివరకు ఉన్నారు

**శ్రవణముచేత దివ్యత్వమును అనుభవించినవాడు పరీక్షిన్మహారాజు**

శృంగునిచేత శాపమును పొంది ఏడుదినములలో మృత్యువును అనుభవించగలడని వార్తను అందిన తక్షణమే కాలమును సార్థకము గావించుకొని ఒక్క క్షణమైనా వ్యర్థము చేయరాదని చెప్పి పరీక్షన్మహారాజు ఋషులను ఆహ్వానించాడు. కాలము వ్యర్థము చేస్తే జీవితమే వ్యర్థమని భావించాడు. ఋషులను ప్రార్థించాడు. ఇంతలో శుక మహర్షి ప్రవేశించాడు. ఎవరికి లభించని ప్రాప్తి తనకు లభించినదని గుర్తించి, ఋషి తనకిచ్చినది శాపము కాదు, మహా వరప్రసాదమని భావించాడు. శుక మహర్షిని స్వాగతము చేసి 'స్వామీ! యీనాడు నేను ధన్యుడనైతిని. ఈ ఏడుదినములు నా జన్మ సార్థకము చేసుకునే మార్గము నాకు వుపదేశించమని కోరాడు. భగవంతునియొక్క లీలాగుణగణ విశేషణములను కళ్యాణాద్భుతమైన తత్త్వములను నిరంతరము రాత్రింబవళ్లు పరీక్షిత్తుకు బోధించటానికి ప్రయత్నించాడు, శుకుడు. ఈ దివ్య ప్రేమవాహినియందు మునిగిన మహారాజేకాక అక్కడ చేరిన వారందరి హృదయములు ఆనంద డోలికలలో ఊగులాడాయి. ఈ బోధనలను విన్న ఋషులందరి మనసులు తన్మయము చెందాయి. ఉన్మత్తులయ్యారు. ప్రేమోన్మత్తులయ్యారు. ఈ యొక్క పరిస్థితిని గుర్తించిన చక్రవర్తి ఆనందములో మునిగిపోయాడు. ఈ విధంగా పరీక్షన్మహారాజు ఒక్క క్షణమైన కాలము వ్యర్థము చేయక భాగవతకథా శ్రవణముచేసి, ఆనందముగా అనుభవించి హృదయకుహరమునందు చేర్చుకున్నాడు. కనుక

sri sathyasai vachanamrutam

శ్రవణముచేత దివ్యత్వాన్ని అనుభవించినవాడు, పరీక్షన్మహారాజు.

కీర్తనము. భగవంతుని నిరంతరము కీర్తించుచూ, భజించుచూ, స్మరించుచూ తరించటానికి తగిన మార్గాన్ని ప్రజలకు కీర్తనద్వారా బోధిస్తూ వచ్చాడు, శుక మహర్షి. ఈ విధమైన రీతిగా కీర్తనలు సలుపుచూ జీవితమును సార్థకముగావించుకున్నవాడే శుక మహర్షి.

**శరీర ప్రజ్ఞలేక నిరంతరము హరి చింతనచేస్తూ జన్మ సార్థకము చేసుకున్నవాడు, ప్రహ్లాదుడు**

విష్ణుస్మరణం. నిరంతరము హరినామకీర్తనయందు తన హృదయమును హరింప జేసుకున్నాడు, ప్రహ్లాదుడు. కష్టములయందు, దుఃఖములయందు, బాధలయందుకూడను "ఓం నమోనారాయణ" అని నిరంతరము హరినామమునే చింతిస్తూ వచ్చాడు, ప్రహ్లాదుడు. రాక్షసులు యెన్ని విధములుగా బాధించినప్పటికిని యేమాత్రము దుఃఖమునకుగాని విచారమునకుగాని తన హృదయమున చోటివ్వక నిరంతరము ఆనందముతోనే తన హృదయాన్ని నింపుకున్నాడు.

**తన్ను నిశాచరులు పొడువ దైత్యకుమారుడు మాటిమాటికో**
**పన్నగశాయి! యో దనుజ భంజన! యో జగదీశ! యో మహా**
**పన్నశరణ్యా! యో నిఖిలపావన! యంచు నుతించుగాని తా**
**గన్నుల నీరుదేడు భయకంపసమేతుడుగాడు భూవరా!**

అని అతనికి విద్యాబుద్ధులు గరపడానికి హిరణ్యకశిపునిచే నియమింపబడిన గురువులు చండామార్కులు నివేదించారు.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహినిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహ నిబంధబంధనల ముద్రలు లేవు నిజంబు జూడ నా**
**దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ**

దైవతత్త్వమున దృష్టి మరల్చిన ప్రహ్లాదునకు దేహతత్త్వము యేరీతిగా కనుపిస్తుంది?

srisathyasaivachanamrutam

దేహము తనదికాదు. ఇది కేవలము ఒక నీటి బుడగ వంటిది. శరీరముద్వారా శరీరిని పొందే నిమిత్తము యేర్పడినది. కనుక యీ శరీరముపైన ప్రజ్ఞ యేమాత్రము లేక నిరంతరము హరిచింతనే గావిస్తూ జన్మను సార్థకము గావించుకున్న వ్యక్తి, యీ ప్రహ్లాదుడు.

**పాదసేవయందు తన జన్మ సార్థకము చేసుకున్నది లక్ష్మి**

పాదసేవనం. ఇది అందరికి లభ్యమయ్యేది కాదు. లభ్యమైనప్పటికిని యేదో ఒక విధమైన లౌకికవాంఛతో పాదసేవన చేస్తూ రావచ్చును. కానీ యీయొక్క సేవయందు తన మనసును అంకితముగావించి సమస్త సృష్టికికూడను యీ పాదములే ప్రమాణము, ప్రధానమనే రీతిగా భావించి, యిదికేవలము బ్రహ్మకడిగిన పాదముగా భావించి, సమస్త జగత్తునుకూడను ఆక్రమించిన పాదముగా విశ్వసించి, సర్వత్ర వ్యాపించిన దివ్యమైన చరణములే యీ చరణములని విశ్వసించి, అట్టి సేవయే నా సాధన అని భావించినది లక్ష్మి. కనుక పాదసేవయందు లక్ష్మి తనయొక్క జన్మము సార్థకము చేసుకొంది.

**పృథుచక్రవర్తి అర్చనచేత జన్మ సార్థకము గావించుకున్నాడు**

అర్చనము. ఈ అర్చనమునకు పృథు చక్రవర్తి ఒక గొప్ప ఉదాహరణము. సర్వకాల సర్వావస్థలయందుకూడను హరి అర్చన తప్ప ఇతరములు తనకేమాత్రముకూడను తెలియదు. 'విశ్వం విష్ణుస్వరూపం'. 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్'. అనేక శిరస్సులతో, అనేక నేత్రములచే, అనేక పాదములచే వుండినటువంటివాడు పరమాత్ముడే! ప్రపంచములోని ప్రాణులన్నియుకూడను పరమాత్ముని అంశములే, పరమాత్మ స్వరూపములే! ఇట్టి భావముచేత నిరంతరము యేది చేసినా, యేది చూచినా, యేది చెప్పినా, యేది తలచినా దైవపూజగానే భావించాడు. ఈ విధమైన అర్చనలచేత జన్మము సార్థకము గావించుకున్నవాడు పృథు చక్రవర్తి.

**అక్రూరుడు సంపూర్ణ శరణాగతితో సర్వత్ర శ్రీ కృష్ణుని స్వరూపమును దర్శించగలిగాడు**

sri sathyasai vachanamrutam

కేవలము ఒక్క వందనముచేతనే తన జన్మము సార్థకము గావించుకొన్నవాడు, అక్రూరుడు. వందనమనగా రెండు హస్తములు చేర్చటము మాత్రము కాదు. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు చేర్చి దశేంద్రియములు పరమాత్మునికి అర్పితము గావించటమే! ఏతావాతా దీనినే శరణాగతియని విశ్వసించాడు. విశ్వాసము యెట్టిదో తన ఫలితము అట్టిది. కనుక యీ అక్రూరుడు సర్వత్ర కృష్ణస్వరూపాన్ని దర్శించగలిగాడు.

**దాస్య భక్తికి గొప్ప ఉదాహరణ, హనుమంతుడు**

దాస్యం. దీనికి హనుమంతుడు ఒక చక్కని ఉదాహరణ. ఇతను నిరంతరము వినయ, విధేయతలచేత రామచింతనతో కాలమును గడుపుతూ వచ్చేవాడు. ఇతను సామాన్యుడుకాదు. అరువదినాలుగు విద్యలను అర్థసహితముగా గ్రహించినవాడు. పైశాచిక విద్యయందు మహాప్రవీణుడు. గజకర్ణగోకర్ణ విద్యలందు మహాప్రవీణుడు. కృష్ణుడు చెప్పుచున్న గీతను పైశాచిక భాషలో ప్రప్రథమముగా రచించినవాడు, హనుమంతుడు. వ్యాసునికంటే పూర్వమే గీతను రచించిన మహానీయుడు యీ హనుమంతుడు. కనుకనే యితనికి శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు హనుమంతుడు అని బిరుదులు ఇచ్చాడు, సాక్షాత్తూ శ్రీరామచంద్రుడు. ఏ పదార్థము ముట్టినప్పటికి ఆ పదార్థములో రామనామము వున్నదా లేదా అని పరిక్షించేవాడు. రామనామము లేనివన్నీ రాళ్లతో సమానమనుకున్నాడు. లంకకు వంతెన కట్టే సమయమునందు రాళ్లను ఎత్తి రామా అని వేసినప్పుడు అవి తేలుతూ వచ్చాయి. ఒక్కొక్క రాయిపైన రామా అని వ్రాయలేదు. ఒక రాయిపైన 'రా', రెండవరాయిపైన 'మ' అని వ్రాస్తూవచ్చాడు. ఈ రెండురాళ్లు సముద్రములో వేసేటప్పటికి రెండు రాళ్లు దగ్గరగా చేరుతూ వచ్చాయి. ఈ విధముగా వంతెన తయారైపోయింది. హనుమంతుని దేహమందున్న రోమ రోమము రామనామమునే తలుస్తూ వచ్చింది, మనము కష్ట సమయములో తప్ప, సుఖమనుభవించే సమయములో దైవ చింతన చేయము. కష్ట సుఖములందు సమత్వాన్ని వహించిన మహాబలవంతుడు యీ హనుమంతుడు.

sri sathyasai vahanamrutam

అహంకారములేని గుణవంతుడు. మమకారము త్యజించిన మహనీయుడు. లంకలో స్వేచ్ఛావిహారము సలుపుతున్న సమయమునందు రాక్షసులు ఎవరయ్యా నీవని ప్రశ్నించగా 'దాసోహం కోసలేంద్రస్య' అని చెప్పాడు. నేను రామచంద్రుని దాసుడను అని చెప్పుకున్నాడు. ఎట్టి పరిస్థితియందుకూడను నేను రామదాసుడనని గట్టిగా చెప్పగల శక్తి గలవాడు. ఈనాడు భక్తులు ఎట్లావుంటారు? మందిరమునకు పోయేటప్పుడు విభూతి పెట్టుకుంటారు. బయటకు పోయేటప్పటికి hand kerchief తీసి తుడిచేసుకుంటారు. స్వామి చెంత వుండినప్పుడు, సమీపములో సంచరించే సమయములందు అన్ని విధాలాకూడను భక్తులుగానే కనపడతారు. బయట ప్రదేశములోకి పోయేప్పటికి 'మేము సాయి భక్తులము కాము; పోతువుంటాము, వస్తూవుంటాము అంతమాత్రమే!' అంటారు. ఇటువంటి పిరికిపందలు భక్తులు యేరీతిగా కాగలరు? ఎట్టి ప్రదేశమునందు పోయినప్పటికిని దానిని ధైర్యంగా చాటాలి. అలాంటి ధీరమైన శక్తి కలిగి వుండాలి, నీ భక్తి. 'అవును, నేను భక్తుడను', అని సంపూర్ణ విశ్వాసముతో చెప్పగలగాలి. ఈ విధమైన ధీరత్వముతోకూడినవాడు హనుమంతుడు. కనుకనే తాను రామ సేవలను ఆచరిస్తూ తన జన్మను సార్థకము గావించుకొని జనుల హృదయాలలో చిరస్థాయిగా నిలచిపోయాడు.

**సాక్షాత్తూ భగవంతుని తన జీవిత రథసారధిగా పొందగలిగినవాడు, అర్జునుడు**

ఇంక మైత్రి విషయం వచ్చేసరికి సఖ్యభక్తి, అర్జునునిది. ఎలాంటి పరిస్థితులయందుకూడను కృష్ణుని ఎడబాయక నిరంతరము వెంటగాజంటగా జీవిస్తూ వచ్చాడు, అర్జునుడు. పాండవులు ఎన్నో బాధలను అనుభవించారు. ఎన్నో నిందలను, నిష్ఠూరములను అనుభవించారు. కడకు అపకీర్తికికూడా పాలయ్యారు. ఎట్టి సమయమునందుకూడను 'కృష్ణా! నీవు తప్ప మాకు అన్యము లేదు', అని ప్రార్థనతో అన్నివిధములుగా కృష్ణుని అండ చేరేవారు. 'నీవే తప్ప నితః పరంబెరుగ', అన్నట్లు నీవు తప్ప అన్యులు లేరని ప్రార్థించేవారు. ఇలా కృష్ణుని వెంట నీడగా ఉంటూ మిత్రునిగా భావించి, బంధువుగా విశ్వసించి అన్నింటియందుకూడను అర్జునుడు కృష్ణుని వుపయోగపెట్టుకొనేవాడు. కనుకనే కృష్ణుడు అతనికి రథసారధిగా నిలచి అనేక విధములైన

sri sathyasai vahamrutam

విజయములను అందిస్తూ వచ్చాడు. భగవంతుని తన జీవితరథసారధిగా పొందగలిగాడు, అర్జునుడు. అందువలననే కృష్ణుని పార్థసారధి అని పిల్చెడివారు. అనగా పార్థునియొక్క జీవితమునకు సారధి, అని.

**బలి చక్రవర్తి నవవిధ భక్తులలో తొమ్మిదవదైన ఆత్మసమర్పణకు గొప్ప ఉదాహరణ**

ఇంక తొమ్మిదవది ఆత్మార్పణం. ఈ విధముగా ఆత్మార్పణగావించి, వామనావతారము కోరిన దానిని అందించి తన జీవితమును సార్థకము గావించుకున్నవాడు, బలిచక్రవర్తి. ఇతను ప్రహ్లాదుని మనుమడు, భగవంతునియందు భక్తిప్రపత్తులతో లీనమైనవాడు. విశ్వజిత్ అనే యాగముచేసి విశ్వముపైనే విజయమును సాధించినవాడు. తన శిరస్సునే వామనమూర్తికి మూడవ అడుగుగా అర్పితముగావించి పాతాళలోకమునందు ప్రవేశించినవాడు. ఏవిధముగానైనప్పటికి భగవంతుని అనుగ్రహమే తనకు ప్రధానమని విశ్వసించినవాడు. తన గురువైన శుక్రాచార్యుడు తాను చేయబోయే దానమునకు అడ్డుతగిలినప్పటికిని, 'లేదు, లేదు. నా దేహము, నా కాయము, నా కర్తవ్యము సర్వముకూడను భగవదర్పితమే'నని భావించాడు.

**భక్తియందు సామూహిక భజనలకు విశిష్టమైన స్థానమున్నది**

కనుక, ప్రాచీన కాలమునుండికూడను నవవిధ భక్తి మార్గములను అనుసరిస్తూ, ఆదర్శముగా నిరూపించిన చక్రవర్తులు, మహాభక్తులు. అయితే యీ భక్తి కేవలము వ్యక్తిగతమైనదిగా నిరూపించటం మంచిది కాదని విశ్వసించి సమిష్టి స్వరూపమైన సామూహిక ప్రార్థనలు అవసరమని భావిస్తూవచ్చారు తరువాత కాలములో. ఎవరికి వారు ప్రార్థన చేసుకోటము, ఎవరికి వారు భగవంతుని చింతించటము యిది స్వార్థపరమైనదనికూడను తలచుతూ వచ్చారు. అటువంటి స్వార్థము పరార్థమును పొందలేదనేది వారి భావన. సామూహిక ప్రార్థనలు అత్యవసరమని భావించారు. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అనే ఆదర్శమును అందుకున్నారు. ఈ విధమైన భావాన్ని అవలంబించినప్పుడు దేశము సుక్షేమాన్ని అనుభవిస్తుందనికూడను తలంచారు. 1469లో



sri sathyasai vahini

సిక్కుల గురువైన గురునానక్ యీ సామూహిక భజనలు ప్రారంభించాడు. ఈ భజనలకు మూలపురుషుడు, పునాది, గురునానక్‌యే! క్రమక్రమేణా ఇటువంటి భజనలు పెరుగుతూ వచ్చాయి. తదుపరి 1498లో త్యాగరాజు రాగతాళ భావములను వీటికి జోడించి కీర్తనలు రచించి, గానము చేస్తూ వచ్చాడు. అప్పటినుండి మన భారతదేశములోపల సామూహిక భజనలంటూ ప్రారంభమవుతూ వచ్చాయి. ఈ భజనలనేవి కేవలము కాలహరణం గావించుకొనే కర్మలుకాదు. అందరి మనస్సులు, అందరి భావములు, అందరి రాగములు, అందరి తాళములుకూడను ఏకమైపోయి దివ్యమైన అనేకత్వములోని ఏకత్వమును నిరూపించినదే భజన అని గుర్తిస్తూ వచ్చారు. ఏతావాతా దీని అంతరార్థమేమన సామూహిక భజనలు చాలా సారవంతమైనవి, సమర్థమైనవి. భక్తియందు సామూహిక భజనలకు ప్రధానమైన స్థానమును అందిచ్చారు. ఈ భజనలుకూడను ప్రేమపూరితమైన భజనలు కావాలి. పల్లెలయందు యిది మొట్టమొదట ప్రారంభించినప్పుడు త్యాగరాజు చెప్పాడు

**రండి పుణ్యాత్ములారా! శ్రీరాముని భజనకు**
**రండి ధన్యాత్ములారా!**
**రండి మనమందరము కోదండరాముని భజనలు చేతము**
**రండి పుణ్యాత్ములారా!**
**శ్రీరాముని భజనకు రండి ధన్యాత్ములారా!**

యీ పాటను ప్రారంభించాడు. రండి మనమందరము కోదండరాముని భజనలు చేద్దాము. ఈ కోదండపాణి దండపాణిని దూరము చేయగలడని భావించాడు. దండపాణి యముడు. కోదండపాణి రాముడు. కోదండపాణి నామము దగ్గర వున్నప్పుడు దండపాణి సమీపించలేడన్నాడు. ఇలాంటి విశ్వాసముతో, యిలాంటి పరిపూర్ణమైనప్రేమతో దివ్యమైన భావముతో భజనలు ప్రారంభమైనాయి.

అయితే యీనాడు సామూహిక భజనలు అట్టి పవిత్రత కోల్పోయాయి. రాగతాళములు ప్రధానముగా చూస్తున్నారేగాని భావములు యేమాత్రము చూడటంలేదు. పదిమందికి ఒక యింపైన రాగముకోసము ప్రయత్నము చేస్తున్నారేగానీ యింపైన భావాన్ని అందించటానికి



sri sathyasai vahini.org

పూనుకోవడంలేదు. ఈ భజనలో వుండిన భావములు హృదయాన్ని కదలించి, కరిగించాలి. ఆ విధమైన భజనలలో భక్తి భావము పరిపూర్ణముగా నిండి వుంటుంది.

**దేవుని పూజించటము, జీవులను బాధించటము భక్తి కానేరదు**

ప్రేమస్వరూపులారా! భక్తి అంటే కేవలము భగవంతుని పూజలు మాత్రమేకాదు. ఇందు ప్రధానమైనది, ప్రేమ. ఈ ప్రేమ అందరియందు వుండిన ప్రేమయే! ఈ ప్రేమను ఏకత్వము గావించుకొనే మార్గమే నిజమైన భక్తిగా భావించాలి. దేవుని పూజించటము, జీవుల్ని బాధించటము భక్తి కానేరదు. సర్వులయందువుండిన భగవంతుని మనము ప్రార్థించాలి. ఆ భగవంతుడు ఎవరు? Love is GOD, Live in Love. అతనే ప్రేమ స్వరూపుడు. ప్రేమనిమిత్తమై మనము ప్రేమను అభివృద్ధి పరచుకోవాలి. ఈ ప్రేమయే పరమాత్మస్వరూపము. అదియే భక్తికి రూపము. అదే దివ్యత్వానికి ప్రతిబింబము. అదే ఆత్మానందమునకు గమ్యము. ఆనందము మనయందే వున్నది. మనము ఎక్కడో వెతకనక్కరలేదు. సర్వత్రా వుండిన భగవంతుని వెతికేది యెక్కడ? వెతకటమనేది వెఱ్ఱితనము. మన దృష్టిని అంతర్ముఖము గావించుకోవాలి. బహిర్ముఖముగా పరుగెత్తే భావములంతా అరికట్టి భగవంతుని వైపు మీ దృష్టిని మరల్చండి. సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థముగా భావించండి. ఇదియే గొప్ప విద్య. ఈ విశాలమైన విద్య మనము అభ్యసించాలి. ఈ అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించాలి. అఖండమైన తేజస్సును మనము అనుభవించాలి. ఇదే జీవితముయొక్క ప్రధానగమ్యము. ఇదే నిజమైన జీవిత మార్గము. ప్రేమకోసమై మనము ప్రేమించుతూ రావాలి. ఇదే way of life. ఈ విధమైన భక్తితో మనము ప్రేమను పెంచుకోవాలి గానీ, 'భక్తి, భక్తి' యని పూజలు, పునస్కారములు, యాత్రలు యీ విధమైన కర్మలాచరించినంతమాత్రమున భక్తి కానేరదు.

**(తేదీ 8-10-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam